ఈనాడు
జోగులాంబ గద్వాల

చిన్నారుల ఆరోగ్యం మీ చేతుల్లోనే!

- 55 శాతం విద్యార్థుల స్నాక్స్ డబ్బాల్లో జంక్ ఫుడ్
- తల్లిదండ్రులు జాగ్రత్త తీసుకోవాలంటున్న వైద్యులు

ఈనాడు, మహబూబ్‌నగర్ –న్యూస్‌టుడే, గద్వాల అర్బన్




గద్వాల : ఇంటి నుంచి తెచ్చుకున్న పండ్లు చూపుతున్న ఓ పాఠశాల చిన్నారులు

చిన్నారులు వాతావరణంలో చిన్న చిన్న మార్పులనే తట్టుకోలేరు.. వాంతులు, విరేచనాలు, జ్వరం బారినపడి ఇబ్బందుల పాలవుతారు. ఒక్కసారి అస్వస్థతకు గురైతే వారం వరకు కోలుకోరు. అలాంటి వాళ్లకు ప్రమాదకరమైన జంక్ ఫుడే రోజూ పెడితే వారి లేత పేగులు ఎలా తయారవుతాయి..? వారి ఆరోగ్యం ఎంత ప్రమాదంలో పడుతుంది..? వారి భవిష్యత్తు ఏమవుతుంది? ఆలోచిస్తేనే భయమేస్తుంది.. ఉమ్మడి జిల్లాలో ఎక్కువ మంది తల్లిదండ్రులు అలాంటి ఆహారమే పెడుతున్నారని 'ఈనాడు' పరిశీలనలో తేలింది. ఇలా చేయటం పిల్లల ఎదుగుదలకు, ఆరోగ్యానికి, భవిష్యత్తుకు చాలా ప్రమాదకరమని వైద్య నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఉమ్మడి జిల్లాలో పరిస్థితిపై 'ఈనాడు' ప్రత్యేక కథనం.



మహబూబ్‌నగర్‌లోని ఓ ప్రైవేటు పాఠశాల చిన్నారుల స్నాక్స్ డబ్బాల్లో తెచ్చుకున్న బిస్కెట్లు, జంక్ ఫుడ్



55 శాతం మందికి జంక్ ఫుడే : నేడు మూడు, నాలుగేళ్ల ప్రాయం నుంచే చిన్నారులను బడికి పంపిస్తున్నాం. ఉదయం 9 గంటల కల్లా వారు పాఠశాలల్లో ఉంటున్నారు. మధ్యాహ్నం తినే భోజనం కూడా ఉదయమే వండి పంపిస్తున్నారు. మధ్యలో తినడానికి చిరుతిళ్లు (స్నాక్స్) డబ్బాలో పెడుతున్నారు. ఉమ్మడి పాలమూరులోని ఐదు జిల్లా కేంద్రాల్లోని పాఠశాలల్లో 1,000 మంది చిన్నారుల చిరుతిళ్ల డబ్బాలు 'ఈనాడు' పరిశీలించగా 55 శాతం చిప్స్, చాక్లెట్లు, మైదా పదార్థాలతో కూడిన ప్రమాదకర ప్యాకేజ్డ్ జంక్ ఫుడ్, బిస్కెట్లు కనిపించాయి. ఉరుకులు పరుగుల జీవితంలో సమయం లేదని తల్లిదండ్రులు సులభమైన పనిగా ఇలా చేస్తున్నారు. కొందరు తల్లిదండ్రులను అడిగితే పిల్లలు అవే తింటారని చెబుతున్నారు. 35.2 శాతం తల్లిదండ్రులు మాత్రం ఇంట్లో వండిన ఆరోగ్యకర ఆహార పదార్థాలు, చిరుతిళ్లు పంపించారు. మరో 9.8 శాతం మంది పిల్లలకు పండ్లను పంపించారు. మొత్తంగా 45 శాతం చిన్నారులకు మంచి ఆహారమే అందుతోంది.

గుర్తించినవి ఇవే..



అమలు కాని నిషేధం : నిబంధనల ప్రకారం ఐదో తరగతి లోపు చిన్నారులు ఉండే పాఠశాలలకు సమీపంలో చిప్స్, ఇతర జంక్ ఫుడ్ విక్రయించొద్దు. ఇది ఎక్కడా అమలు కావటం లేదు. పాఠశాలలకు ఆనుకునే ఉన్న దుకాణాల్లో యథేచ్ఛగా అమ్మకాలు సాగుతున్నాయి. ప్రభుత్వ పాఠశాలల్లో చదివే పిల్లలు తల్లిదండ్రులు ఇచ్చే రూ.5, రూ.10లతో జంక్ ఫుడే కొనుక్కుని తింటున్నారు.



నీటి గంట అవసరం : చాలా పాఠశాలల్లో విద్యార్థులు స్నాక్ డబ్బాతో పాటు నీటిసీసాలు తెచ్చుకుంటున్నారు. 80 శాతం చిన్నారులు భోజనం సమయంలో మాత్రమే నీటిని తాగుతున్నారు. సీసాల్లోని నీటిని అలాగే ఇంటికి తీసుకొస్తున్నారు. పాఠశాలల్లో నీటి గంట(వాటర్ బెల్) అమలు చేయాల్సిన అవసరముంది.



ఈ ప్రయత్నం బాగు : మహబూబ్‌నగర్, గద్వాల, వనపర్తి, జడ్చర్ల, నారాయణపేట, నాగర్‌కర్నూల్, కల్వకుర్తి వంటి పట్టణాల్లోని కొన్ని ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాలు విద్యార్థులు జంక్ ఫుడ్ తినకుండా ప్రత్యేక శ్రద్ధ పెడుతున్నారు. ఎవరైనా జంక్‌ఫుడ్ తెచ్చుకుంటే ఉపాధ్యాయులు తల్లిదండ్రులకు ఫోన్‌చేసి అవగాహన కల్పిస్తున్నారు.



ఇన్‌ఫెక్షన్లు, ఊబకాయం సమస్యలు : చిన్నారులకు జంక్ ఫుడ్ అలవాటైతే అన్నంపై ఆసక్తి చూపరు. జీర్ణ శక్తి మందగిస్తుంది. మాంసకృత్తులు, కార్బొహైడ్రేట్లు, విటమిన్లు అందక ఎదుగుదల లోపించి ఆరోగ్యం దెబ్బ తింటుంది. జంకుఫుడ్‌లో నూనె, కలుషిత పదార్థాలు అధికంగా ఉంటాయి. వాటిని తినటం వల్ల పిల్లలకు నీళ్ల విరేచనాలు అవుతాయి. వయస్సు పెరిగే కొద్దీ గ్యాస్, కడుపునొప్పి, ఊబకాయం, రక్తపోటు, అధిక కొలెస్ట్రాల్, మధుమేహం వంటి అనారోగ్య సమస్యలు వస్తాయి. తరచూ ఇన్‌ఫెక్షన్ల బారినపడి అస్వస్థతకు గురవుతారు.

- డా.బాల శ్రీనివాస్, చిన్న పిల్లల వైద్య నిపుణులు, మహబూబ్‌నగర్ జనరల్ ఆస్పత్రి



పండ్లు, పోషకాహారం అవసరం.. : ప్యాకింగ్ ఆహారంలో గ్యాస్ ఉంటుంది. కవర్ వాసన వస్తుంది. బిస్కెట్లలో మైదా ఎక్కువగా ఉంటుంది. వీటిని నమలకుండానే తినేస్తుటారు. ఇది చాలా ప్రమాదకరం. పిల్లలకు చిప్స్, ఇతర ప్యాకింగ్ ఆహారాన్ని స్నాక్స్ డబ్బాల్లో అస్సలు పెట్టొద్దు. ఐదో తరగతిలోపు చిన్నారులకు పండ్ల రసాలు, పండ్లు, క్యారెట్, కీరా, జామ, ఇంట్లో తయారు చేసే సంప్రదాయ అల్పాహారం పెట్టాలి. రక్తహీనత బారినపడకుండా పెద్ద పిల్లలకు పల్లీలు, బెల్లం చిక్కీలు, బాదం, పిస్తా, లడ్డూలు, ఉడకబెట్టిన గుడ్లు, పండ్లు అందించాలి.

- శైలజ, పోషకాహార కౌన్సెలర్, మహబూబ్‌నగర్ జనరల్ ఆస్పత్రి

అరకొర కేటాయింపులతో అవస్థలు

ఉద్యాన రైతులకు దక్కని తుంపర పరికరాలు



వేరుశనగ చేనులో తుంపర పరికరాలు

న్యూస్‌టుడే, మహబూబ్‌నగర్ వ్యవసాయం : ఉద్యాన శాఖలో తుంపర పరికరాల పంపిణీ పెద్ద సమస్యగా మారింది. రాష్ట్ర ప్రభుత్వం రాయితీపై తుంపర పరికరాలను అందించాలని నిర్ణయించినా ఒక్కో మండలానికి ఐదు యూనిట్లను కూడా కేటాయించలేదు. యాసంగి పంటగా వేరుశనగ సాగు చేసిన రైతుల నుంచి మాత్రం భారీగా డిమాండ్ ఉంది. ఒక్క నాగర్‌కర్నూల్ జిల్లాలో ఏకంగా 6,500 మంది రైతులు తుంపర పరికరాలు కావాలని దరఖాస్తు చేశారంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు. ఒక్క జోగులాంబ గద్వాల జిల్లాలోనే డిమాండ్ తక్కువగా ఉంది. జిల్లాకు 80 యూనిట్లను మాత్రమే కేటాయించగా ఎస్సీ, ఎస్టీ రైతులను ఎంపిక చేశారు. మరో 500 మంది వరకు రైతులు పరికరాల కోసం ఎదురు చూస్తున్నారు.

ప్రచారం లేకపోయినా భారీ దరఖాస్తులు : ఉమ్మడి జిల్లాలో వేరుశనగ పంట 2.60 లక్షల ఎకరాల్లో సాగైంది. నాగర్‌కర్నూల్ జిల్లాలో 1.20 ఎకరాల్లో సాగు చేశారు. ఇంకా సాగు [illegible] ఇక్కడే తుంపర పరికరాలకు

జిల్లా	దరఖాస్తులు	యూనిట్లు
నాగర్‌కర్నూల్	6,500	516
మహబూబ్‌నగర్	2,900	100
నారాయణపేట	3,200	100
వనపర్తి	5,000	162
గద్వాల	580	80

ఎక్కువ డిమాండ్ ఉంది. గడచిన ఐదేళ్లుగా తుంపర పరికరాలపై గత ప్రభుత్వం రాయితీ ఇవ్వలేదు. ఈసారి రాష్ట్ర ప్రభుత్వం ఒక్కో యూనిట్‌కు రూ.23,385గా ధర నిర్ణయించింది. ఇందులో ప్రభుత్వం 75 శాతం అంటే రూ.17,539 రాయితీగా భరిస్తుంది. మిగతా 25 శాతంగా రూ.7,483లను రైతు డీడీ తీసి ఉద్యాన శాఖకు సమర్పిస్తే 25 హెచ్‌డీ పైపులు, ఐదు తుంపర పరికరాల నాజిల్స్ అందిస్తారు. ఉమ్మడి జిల్లాకు 958 యూనిట్లను మాత్రమే కేటాయించగా 18,100 మంది రైతులు దరఖాస్తు చేసుకున్నారు. ప్రభుత్వం రాయితీ ఇస్తున్నట్లు ప్రచారం చేసి ఉంటే ఇంకా రెండు మూడింతల దరఖాస్తులు వచ్చేవంటే అతిశయోక్తి కాదు.

అధికారులకు తలనొప్పిగా.. : ఉద్యాన శాఖ అధికారులు ప్రభుత్వం కేటాయించిన అరకొర యూనిట్లను వేల మంది దరఖాస్తుదారుల్లో ఎవరికి పంచాలో తెలియక తలలు పట్టుకుంటున్నారు. ఇప్పటికే కొందరు రైతులు ఎమ్మెల్యేల సిఫార్సు లేఖలు తెచ్చి కార్యాలయాల్లోని అధికారులకు అందిస్తున్నారు. కొందరు ఫోన్లు చేస్తున్నారు. జిల్లా అధికారులు ఎవరిని ఎంపిక చేయకుండా మరిన్ని యూనిట్లను కావాలని రాష్ట్ర ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపారు. నాగర్‌కర్నూల్, మహబూబ్‌నగర్, వనపర్తి, జోగులాంబ గద్వాల జిల్లాల ఉద్యాన శాఖ అధికారులు జగన్, అక్బర్, వేణుగోపాల్, సురేష్‌లు 'న్యూస్‌టుడే'తో మాట్లాడుతూ ఉమ్మడి జిల్లాలో పరిస్థితిని రాష్ట్ర ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లామని, ఎమ్మెల్యేలు కూడా చెప్పారని పేర్కొన్నారు.

పీయూ ఉపకులపతి బాధ్యతల స్వీకరణ



ఇన్‌ఛార్జి వీసీ నదీం అహ్మద్ నుంచి బాధ్యతలు స్వీకరిస్తున్న శ్రీనివాస్

పాలమూరు, న్యూస్‌టుడే : పాలమూరు విశ్వవిద్యాలయం ఉపకులపతిగా డా.జీఎన్ శ్రీనివాస్ శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఈ ఏడాది మే 21 నుంచి ఉపకులపతి పోస్టు ఖాళీగానే ఉంది. లక్ష్మీకాంత్ రాథోడ్ తర్వాత రెగ్యులర్ ఉపకులపతి రాకపోవడంతో రాష్ట్ర ప్రణాళికా సంఘం ముఖ్య కార్యదర్శిగా పనిచేస్తున్న నదీం అహ్మద్‌కు ఇన్‌ఛార్జి బాధ్యతలు అప్పగించారు. దీంతో ఆయన నుంచి శ్రీనివాస్ బాధ్యతలు తీసుకున్నారు. సోమవారం ఉపకులపతి శ్రీనివాస్ పాలమూరు విశ్వవిద్యాలయానికి రానున్నారు.

కోనోకార్పస్ చెట్ల తొలగింపు



శ్వాస కోశ వ్యాధులకు కారణమవుతున్నాయన్న కారణంగా పురపాలిక పరిధిలో పెద్దఎత్తున కోనోకార్పస్ చెట్లను తొలగిస్తున్నారు. శనివారం గద్వాల పట్టణంలోని కలెక్టర్ కార్యాలయం ముందు నుంచి మొదలుకుని ఎర్రవల్లికి వెళ్లే మార్గం గుండా రహదారి పొడవునా డివైడర్‌పై ఉన్న కోనోకార్పస్ చెట్లను మున్సిపల్ సిబ్బంది తొలగించిన దృశ్యమే ఇది.

-న్యూస్‌టుడే, గద్వాల పట్టణం

కళా ఉత్సవ్ విజేతలు వీరే

గద్వాల అర్బన్, న్యూస్‌టుడే: గద్వాలలోని బాలభవన్‌లో ఈ నెల 16, 17వ తేదీల్లో నిర్వహించిన జిల్లా స్థాయి పోటీల్లో విజేతలను శనివారం జిల్లా విద్యాశాఖాధికారి రవీందర్, సమన్వయ అధికారి ఎస్తేర్‌రాణి ప్రకటించారు. మొదటి స్థాయిలో నిలిచిన వారు నవంబరు 1, 2వ తేదీల్లో నిర్వహించే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొనాల్సి ఉంటుందన్నారు. డ్రామాలో ప్రవీన్ బృందం(జడ్పీహెచ్ఎస్ అమరవాయి), నృత్యంలో అంకిత (దేవ్ మోడల్ స్కూల్, రేవులపల్లి), ఇన్‌స్ట్రుమెంటల్‌లో కేశవర్ధన్(జడ్పీహెచ్ఎస్ అమరవాయి), వోకల్‌లో గాయత్రి (ప్రగతి ఉన్నత పాఠశాల గద్వాల), స్టోరీ టెల్లింగ్‌లో మంజుల బృందం (నోబుల్ ఉన్నత పాఠశాల, గద్వాల), విజువల్‌లో శ్రావణి (ప్రగతి ఉన్నత పాఠశాల, గద్వాల) మొదటి స్థానాల్లో నిలిచారు.



- 'అబ్బబ్బా.. ఈ మధ్య పని ఎక్కువైంది. మా పిల్లలు తిన్న తర్వాత కంచం తీయరు. బడి నుంచి వచ్చి పుస్తకాల సంచి ఓ చోట, దుస్తులు మరోచోట పారేస్తారు. వాటిని సర్దాలంటే తల ప్రాణం తోక కొస్తోంది'.

అంటూ ఓ తల్లి పని మొత్తం చేస్తారు

- 'మా పాప డిగ్రీ చదువుతోంది.. ఇల్లు ఊడ్చదు. కంచంలోంచి కింద పడిన మెతుకులు తీయదు. మా వాడికేమో దుప్పటి మడతపెట్టడం రాదు. గదుల్లో లైట్లు ఆఫ్ చేయాలన్నా మా పనే..'

మరో మాతృమూర్తి ఇంటి పనంతా చక్కబెడతారు

ఇంత వరకు బాగానే ఉన్నా, వారిని మార్చాల్సింది.. కొంతలో కొంతైనా పని నేర్పాల్సింది కుటుంబ సభ్యులు.. తల్లే కదా!

ఆదివారం అమ్మకు తోడుగా..

న్యూస్‌టుడే–కొత్తకోట



సెలవుల్లో చరవాణులను పక్కన బెట్టి అమ్మకు సాయం చేద్దాం అనే భావన పిల్లల్లో కల్పించండి. వారిలో తప్పని సరిగా మార్పు వస్తుంది. వారు కోరుకున్న వంట వారి చేతే చేయించండి. ఆ అనుభూతే వేరు. ప్రేమించడం తప్పు కాదు.. కాని, ఆ ప్రేమలో తెలియకుండానే సోమరితనంగా మారిస్తే జీవన నైపుణ్యాలు లేక పిల్లల ఉన్నతికి ప్రతి బంధకమవుతుంది. విద్య, ఉపాధి అవకాశాలకు గడప దాటినప్పుడు కొత్త వాతావరణంలో ఇమడలేక గందరగోళంలో పడతారని నిపుణుల హెచ్చరిక. బాల్యంలో ఇంటి పనులు నేర్పితే గృహ నిర్వహణలో ఆర్థిక, భౌతిక, సాంఘిక, భావోద్వేగ నైపుణ్యాలు వృద్ధి చెందుతాయని విద్యాశాఖ చెబుతుంది. 3 నుంచి 5వ తరగతులకు పని, విద్య నిర్దేశించిన అంశాల్లో ప్రస్తావించింది. వీటిని 'ఆదివారం' నుంచి ఆచరించడంలో పిల్లలను ప్రోత్సహిద్దాం.



బాధ్యత పెరుగుతుంది : సొంతంగా పనులు చేయడం వల్ల పిల్లల్లో బాధ్యత పెరుగుతుంది. వారిలో ధైర్యం, పట్టుదల, క్రమ శిక్షణవంటి లక్షణాలు అలవడుతాయి. వారిపై నమ్మకం ఏర్పడుతుంది. సేవాలక్షణాలు పెరిగి సమాజ సేవలో పాల్గొంటారు. ఇంట్లో అందరూ పనిచేయడం వల్ల కుటుంబమంతా కలిసి గడిపే నాణ్యమైన సమయం పెరుగుతుంది. సంబంధ బాంధవ్యాలు మెరుగవుతాయి. మంచి చెడు పంచుకోవడంతో ఈ తరాన్ని వేధిస్తున్న ఒత్తిడి, కుంగుబాటు, ఆందోళన వంటివి దరి చేరవు.

పిల్లలతో ఇంటి పనులు చేయిద్దాం

(పని, విద్య పుస్తకంలో నిర్దేశించిన కృత్యాలు)

- ఉతికి ఆరేసిన దుస్తులను మడత పెట్టి భద్రపరచుకోవడం
- చెప్పులు, బూట్లను శుభ్రం చేసి క్రమపద్ధతిలో పెట్టుకోవడం
- విడిచిన దుస్తులు తల్లిదండ్రుల సలహా మేరకు వేయడం
- వినియోగ వస్తువులను, దుస్తులు, పుస్తకాలు, క్రమపద్ధతిలో అమర్చుకోవడం
- ఇంటి సరకులు తీసుకురావడంలో సాయం చేయడం
- నీళ్లు పట్టడం, ఇల్లు శుభ్రం చేయడం, వంట చేయడంలో సహకరించడం
- మొక్కలకు నీళ్లు పట్టడం, ఎరువులు వేయడం
- భోజనవేళలో తాగునీరు ఏర్పాటు చేయడం, కంచాలు తీసి కడగడం
- మరుగుదొడ్లను వినియోగించాక నీరు పోసి పరిశుభ్రంగా ఉంచడం





తల్లిదండ్రులదే బాధ్యత : పిల్లల్ని మీరు నిజంగా ప్రేమిస్తున్నట్లయితే వారితో తరచూ ఇంటి పనులు చేయించండి. వారికి బాధ్యతలను గుర్తు చేయండి. ఏ పని చేస్తున్నా బాగుంది.. ఇంకా వేగంగా.. మెరుగ్గా.. చేయగలవంటూ ప్రోత్సహించండి. వారి భాగస్వామం లేకుండా కుటుంబ పనులు పూర్తి కావని అర్థమయ్యేలా చెప్పండి. పిల్లల్ని ప్రేమించడంతో పాటు వారికి అన్ని నేర్పించడం తల్లిదండ్రుల బాధ్యత.

- శ్రీనివాసరాజు, మానసిక వైద్యనిపుణులు, మహబూబ్‌నగర్

కంచే చేను మేస్తే..!

గద్వాల పట్టణం, న్యూస్‌టుడే: పరిశుభ్రమైన తాగునీటిని అందిస్తున్నామని చెప్పే అధికారులు.. పట్టణంలో సుమారు 20 వేల మందికి సరఫరా చేసే తాగునీటి కలుషితానికి తమ సిబ్బంది చర్యలే కారణమని తెలుసుకోలేకున్నారా... తాగే నీటివనరుల్లో పురపాలికలో సేకరించిన హోటళ్ల, ఆసుపత్రుల వ్యర్థాలు కలిస్తే ఎంత ప్రమాదకరమో వారికి తెలియదా.. గద్వాల పురపాలికలో ఇదే జరుగుతోంది. అదేమంటే.. అరే.. ఈ విషయం ఇంతవరకు మా దృష్టికి రాలేదే అంటున్నారు.

దేవాలయ భూమే డంపింగ్‌యార్డు: గద్వాల ఆర్డీవో కార్యాలయానికి ఆనుకుని పరశురాముని దేవాలయ భూమి ఉంది. దాన్ని పురపాలక సిబ్బంది డంపింగ్ యార్డులా మార్చేశారు. పట్టణంలో సేకరించిన చెత్తను, బయోవ్యర్థాలను ట్రాక్టర్ల ద్వారా తీసుకొచ్చి ఈ స్థలంలో డంప్ చేస్తున్నారు. గత కొంతకాలంగా ఈ నిర్వాకం జరుగుతున్నా అధికారులకు పట్టనట్లు వ్యవహరిస్తున్నారనే ఆరోపణలున్నాయి.



పట్టణంలో సేకరించిన వ్యర్థాలను, చెత్తను దేవాలయ భూమిలో డంప్ చేస్తున్న పుర సిబ్బంది

జములమ్మ రిజర్వాయర్‌లోకి..: పారబోస్తున్నవి పట్టణంలో హోటళ్ల వ్యర్థాలు, ఆసుపత్రిలోని బయోవ్యర్థాలు, సిరంజీలు, మందులు, మాంసం దుకాణాల వ్యర్థాలు తదితరాలున్నాయి. గద్వాల పుర సిబ్బంది చెత్త సేకరించే ట్రాక్టర్ల ద్వారా వాటిని తీసుకొచ్చి ఇక్కడ డంప్ చేసి నిప్పు పెడుతున్నారు. ఈ వ్యర్థాలన్నీ అక్కడే ఉన్న వాగులో కలుస్తున్నాయి. వర్షం కురిసినప్పుడల్లా నీరు ప్రవహించి జములమ్మ దేవాలయం వద్ద ఉన్న రిజర్వాయర్‌లో కలుస్తోంది. ఈ రిజర్వాయర్ నుంచి నీటి శుద్ధి కేంద్రాల ద్వారా పట్టణంలోని కొత్త హౌసింగ్ బోర్డు కాలనీ, హమాలీ కాలనీ, సంతోష్‌నగర్, బీరుల్లిచౌరస్తా, లింగంబావి కాలనీ, నల్లకుంటవీధి ఇలా పలు కాలనీలకు తాగునీటిని అందిస్తున్నారు. ఆ విధంగా కలుషితమైన, ప్రమాదకరమైన నీటిని నాలుగో వంతు పట్టణానికి సరఫరా చేస్తున్నారు.

డంపింగ్‌యార్డు ఉన్నా..: గద్వాల మండలం గోనుపాడు వద్ద పట్టణానికి సంబంధించిన డంపింగ్ యార్డ్ ఉంది. వాస్తవానికి చెత్తను అక్కడకు తరలించాలి. కాగా కొందరు సిబ్బంది చెత్తను తీసుకెళ్ళకుండా పట్టణంలోని జములమ్మ దేవాలయం వద్ద పరశురాముని ఆలయానికి సంబంధించిన భూమిలోనే పారబోస్తున్నారు. శనివారం పుర సిబ్బంది చెత్తను సేకరించిన ట్రాక్టర్ ద్వారా ఆలయ స్థలంలో డంప్‌చేస్తూ కనిపించారు.



వాగులో కలుస్తున్న వ్యర్థాలు

పరిశీలించి చర్యలు

గద్వాల మున్సిపాలిటీకి సంబంధించి గోనుపాడు వద్ద డంపింగ్ యార్డ్ ఉంది. పట్టణంలో సేకరించిన చెత్తను అక్కడే డంప్‌చెయ్యాలి. పరశురాముని దేవాలయ భూమిలో చెత్తను డంప్ చేస్తున్న విషయం మా దృష్టికి రాలేదు. సమస్యను పరిశీలించి తగుచర్యలు తీసుకుంటాను.

-దశరథ్, పుర కమిషనర్

అధికారుల దృష్టికి..

దేవాలయ స్థలంలో చెత్తను వేస్తున్న విషయం నాకు తెలియదు. పరిశీలించి సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్తాను.

-పురేందర్, ఈవో, జములమ్మ దేవాలయం

గట్టు నుంచి మట్టిలో మాణిక్యాలు: కలెక్టర్



ఎంబీబీఎస్ సీట్లు సాధించిన గట్టు విద్యార్థులతో కలెక్టర్

ధరూరు, న్యూస్‌టుడే: గట్టు మండలం అక్షరాస్యతలో రాష్ట్రంలోనే వెనకబడిన మండలం. దశాబ్దాల కాలంగా అక్షరాస్యత పెంపు కోసం ప్రభుత్వాలు ఏ విద్యా కార్యక్రమం తీసుకున్నా ఇక్కడి నుంచే మొదలు పెట్టేవారు. పరిస్థితులు మారాయి. పిల్లల చదువులకు తల్లిదండ్రులు ప్రాధాన్యం ఇస్తున్నారు. తాజాగా మండలం నుంచి నీట్ రాసి ఆరుగురు విద్యార్థులు రాష్ట్రంలోని వివిధ కళాశాలల్లో ఈ ఏడాది ఎంబీబీఎస్ సీట్లు సాధించారు. వీరిలో జె.ఝాన్సీరాణి, జి.సాయి స్ఫూర్తి, ఎండీ సోహేల్, కుర్వకుమార్, సానియాబిజ్జ, ఎన్.అక్షయ ఉన్నారు. వీరిని జిల్లా కలెక్టర్ బీఎం సంతోష్ తన కార్యాలయంలో ప్రత్యేకంగా అభినందించారు.

కృష్ణాతీరం.. పర్యాటక సోయగం!



సోమశిలకు పర్యాటకుల సంఖ్య క్రమంగా పెరుగుతుండటంతో వారాంతాల్లో ఇక్కడ సందడిగా ఉంటోంది. నదిని ఆనుకుని ప్రకృతి ఒడిలో సేదతీరేందుకు వచ్చేవారిని ఆకట్టుకునేలా కొత్త రిసార్టులు వెలుస్తున్నాయి. సోమశిలలో ఓ చోట కనిపించిన దృశ్యాన్ని 'ఈనాడు' క్లిక్ మనిపించింది.

- ఈనాడు, మహబూబ్‌నగర్

ఉత్సాహంగా సీఎం కప్ క్రీడా జ్యోతి ర్యాలీ



ర్యాలీని ప్రారంభిస్తున్న కలెక్టర్ సంతోష్, చిత్రంలో ఎస్పీ, ఎమ్మెల్యే, అదనపు కలెక్టర్ తదితరులు

గద్వాల పట్టణం, న్యూస్‌టుడే: రాష్ట్రంలో ప్రతిభ గల క్రీడాకారులను ప్రోత్సహించడానికి సీఎం కప్-2024 క్రీడా పోటీలు నిర్వహిస్తున్నట్లు గద్వాల జిల్లా కలెక్టర్ బీఎం సంతోష్ పేర్కొన్నారు. శనివారం గద్వాలకు చేరుకున్న సీఎం కప్ క్రీడా జ్యోతికి సంగాల పార్క్ వద్ద కలెక్టర్, ఎస్పీ శ్రీనివాసరావు, ఎమ్మెల్యే కృష్ణమోహన్‌రెడ్డి ఘన స్వాగతం పలికారు. అనంతరం జెండా ఊపి ర్యాలీని ప్రారంభించారు. గాంధీ చౌక్, పాతబస్టాండ్ మీదుగా కలెక్టర్ కార్యాలయం వరకు ర్యాలీ సాగింది. అదనపు కలెక్టర్ లక్ష్మీనారాయణ, పదో పటాలం డీఎస్పీ రఘునాథ్ చౌహాన్, జిల్లా యువజన క్రీడల శాఖ అధికారి బీఎస్ ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

పాలమూరు విద్యార్థినికి ప్రథమ స్థానం



దీక్షితకు ప్రశంసాపత్రాన్ని అందిస్తున్న ఎస్సీఈఆర్టీ డైరెక్టర్ రమేశ్

పాలమూరు, న్యూస్‌టుడే: రాష్ట్ర స్థాయి సైన్స్ డ్రామా పోటీల్లో పాలమూరు విద్యార్థినికి ప్రథమ స్థానం లభించింది. ఈ మేరకు శనివారం హైదరాబాద్‌లో నిర్వహించిన పోటీల్లో ఉత్తమ రచయితగా పాలమూరు జిల్లా కేంద్రంలోని దక్ష ఉన్నత పాఠశాల విద్యార్థినీ దీక్షితకు విజయం సాధించింది. ఈ మేరకు ఆ విద్యార్థినికి ఎస్సీఈఆర్టీ డైరెక్టర్ రమేశ్ ప్రశంసాపత్రాన్ని అందించారు. రాష్ట్ర స్థాయిలో పాలమూరు విద్యార్థిని ప్రథమస్థానంలో నిలిచి బహుమతిని గెలిచినందుకు అభినందనలు తెలుపుతున్నట్లు డీఈవో రవీందర్ తెలిపారు. కార్యక్రమంలో సీఎంవో బాలుయాదవ్, డీఎస్‌వో శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

వేములలో ఉమ్మడి జిల్లా స్థాయి వాలీబాల్ పోటీలు



తలపడుతున్న మహబూబ్‌నగర్, గద్వాల జట్లు

అడ్డాకుల, న్యూస్‌టుడే: మూసాపేట మండలం వేముల గ్రామంలో శనివారం ఉమ్మడి జిల్లా స్థాయి అండర్ 17 బాల బాలికల వాలీబాల్ పోటీలు నిర్వహించినట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రాజేశ్వర్ తెలిపారు. బాలుర విభాగంలో ప్రథమ స్థానంలో మహబూబ్‌నగర్ జిల్లా, ద్వితీయ స్థానంలో గద్వాల జిల్లా, తృతీయ స్థానంలో నారాయణపేట జిల్లా, బాలికల విభాగంలో ప్రథమ స్థానంలో మహబూబ్‌నగర్ జిల్లా, ద్వితీయ స్థానంలో నాగర్‌కర్నూల్ జిల్లా, తృతీయ స్థానంలో గద్వాల జిల్లా జట్లు నిలిచాయి. ఈనెల 28న పెద్దపల్లిలో నిర్వహించే రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలకు గెలుపొందిన క్రీడాకారుల్లో ఉమ్మడి జిల్లా నుంచి ఒక జట్టును ఎంపిక చేసినట్లు ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో ఉమ్మడి జిల్లా అధికారులు శారదాబాయి, పాండు, జగన్‌మోహన్‌గౌడ్, నిరంజన్‌రావు, వడెన్న, జేపీఎన్‌సీఈ రవికుమార్, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

హంగుల్లో తగ్గేదేలే!

హైదరాబాద్‌కు దీటుగా పాలమూరులోనూ గృహాలంకరణ



మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని ఓ కాలనీలో నివాసం ఉండే పోలీస్ ఉద్యోగి తన అభిరుచి మేరకు అద్భుతంగా ఇంటిని నిర్మించారు. 235 గజాల స్థలంలో రూ.1.60 కోట్లతో ఇంటిని సుందరంగా తీర్చిదిద్దారు. ఆ ఇంటిలోని ఓ గదిలో గోడకు ప్లాస్టర్ ఆఫ్ పారిస్‌తో చేసిన హంస బొమ్మ ఆకట్టుకుంటోంది. కేవలం ఆ బొమ్మ కోసమే రూ.42 వేలు ఖర్చు చేశారు. ఇంటిలోని అంతర్గత నిర్మాణం కోసం రూ.16లక్షలు ఖర్చు చేశారు.



మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని ఓ కాలనీలో నివాసం ఉండే ప్రభుత్వ వ్యాయామ ఉపాధ్యాయురాలు తన ఆసక్తి మేరకు 185 గజాల్లో రూ.1.40 కోట్లతో ఇంటిని నిర్మించుకున్నారు. ప్రతి గదిలో అందంగా ఆకట్టుకునేలా బొమ్మలు, ఇతర గృహోపకరణాలను వినియోగించారు. పడక గదిలో విభిన్నంగా విద్యుత్తు కాంతి వచ్చేలా అద్భుతంగా చిత్రాలు అమర్చారు. గృహాలంకరణకు దాదాపు రూ.12 లక్షల వరకు ఖర్చు చేశారు.



మహబూబ్‌నగర్ : ఓ ఇంట్లోని హోం థియేటర్

న్యూస్‌టుడే, పాలమూరు, కల్వకుర్తి

ఇల్లు కట్టుకోవటం ఓ కళ. అన్ని హంగులతో ఇంటిని ఏర్పాటు చేసుకొని చిరకాల వాంఛ తీర్చుకుంటున్నారు. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలోని పట్టణాల్లో రహదారుల సుందరీకరణ, తదితర సౌకర్యాలు సమకూరుతున్నాయి. దీంతో రూ. కోట్లు ఖర్చు చేసి భవనాల నిర్మాణం చేసుకుంటున్నారు. పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా వసతులు సమకూరుతున్నాయి. అయిదు జిల్లా కేంద్రాలతో పాటు మొత్తం 19 పురపాలికల్లో కాలనీలు వేగంగా విస్తరిస్తున్నాయి. దీనికి తోడు రాష్ట్ర రాజధాని నగరం 100 కిలోమీటర్ల పరిధిలోనే ఉండటంతో ఉమ్మడి జిల్లాలోని పట్టణాల్లో హంగులతో సొంతింటికి మొగ్గు చూపుతున్నారు. అవసరాలు, అభిరుచుల మేరకు అధునాతన వసతులు, భవనాలను అద్భుతమైన రీతిలో నిర్మించు కుంటున్నారు.

● హైదరాబాద్, బెంగళూరు, చెన్నై తదితర ప్రాంతాల నుంచి ప్రత్యేకంగా గృహాలంకరణ నిపుణులను పిలిచి పనులు అప్పగిస్తున్నారు. గదుల్లో అలంకరణ, పడక, పూజ గదులను దేనికదే ప్రత్యేక సంతరించుకునేలా తీర్చిదిద్దుకుంటున్నారు. ఓపెన్ కిచెన్‌కు ప్రాధాన్యం ఇస్తున్నారు. సామాన్య ఉద్యోగులు, రైతులు, వ్యాపారులు, ఉన్నతోద్యోగులు, రాజకీయ నాయకుల ఇళ్లలోనూ ఆకర్షణీయ హంగుల కోసం ఖర్చుకు వెనుకాడటం లేదు.



కల్వకుర్తి : ఓ ఇంట్లో జిగేల్‌మనిపించే గది అలంకరణ



రూ.5 లక్షలతో నిర్మించిన అధునాతన వంట గది



చేతితో తాకే అద్దంలో వెలుగుతున్న విద్యుద్దీపాలు

రాష్ట్ర స్థాయి విలువిద్య పోటీలకు క్రీడాకారుల ఎంపిక

మహబూబ్‌నగర్ గ్రామీణం, న్యూస్‌టుడే: త్వరలో పాఠశాల క్రీడా సమాఖ్య(ఎస్‌జీఎఫ్) ఆధ్వర్యంలో నిర్వహించే విలువిద్య పోటీల్లో పాల్గొనే ఉమ్మడి జిల్లా అండర్-14, 17 బాల బాలికల జట్లను శనివారం మహబూబ్‌నగర్‌లోని బీఎస్ఏ మైదానంలో ఎంపిక చేశారు. రాష్ట్ర స్థాయిలో త్వరలో జరగనున్న విలువిద్య పోటీలకు ఈ జట్లను పంపడం జరుగుతుందని ఎస్‌జీఎఫ్ కార్యదర్శి శారదాబాయి తెలిపారు. కార్యక్రమంలో వ్యాయామ ఉపాధ్యాయులు వేణుగోపాల్, జగన్‌మోహన్‌గౌడ్, విలువిద్య కోచ్ జ్ఞానేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

వైద్య విద్యార్థికి అండగా ఉంటా : కేటీఆర్

అయిజ, న్యూస్‌టుడే: అయిజ మండలం వెంకటాపూర్‌కు చెందిన వైద్య విద్యార్థి సుస్మితకు అండగా ఉంటామని భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ పేర్కొన్నారు. వెంకటాపూర్ గ్రామానికి చెందిన బుజ్జమ్మ, దేవదాసు దంపతుల కూతురు సుస్మిత నీట్‌లో ప్రతిభ చాటి ఉస్మానియా మెడికల్ కళాశాలలో సీటు సాధించింది. తల్లిదండ్రులు ఆర్థిక స్థోమత లేక ఇబ్బందిపడుతున్నారని కేటీఆర్‌ను ట్యాగ్ చేస్తూ సామాజిక మాధ్యమం 'ఎక్స్'లో పోస్ట్ చేశారు. స్పందించిన కేటీఆర్ 'ఐ విల్ సపోర్ట్ పర్సనల్లీ' అంటూ 'ఎక్స్'లో సందేశం పెట్టడంతో తల్లిదండ్రులు సంతోషం వ్యక్తం చేశారు.



'ఎక్స్'లో కేటీఆర్ సందేశం

త్రుటిలో తప్పిన ప్రాణాపాయం



రైలు చక్రాల వద్ద ద్విచక్ర వాహనం

మానవపాడు, న్యూస్‌టుడే: ఓ వ్యక్తి ద్విచక్ర వాహనాన్ని రైల్వే ట్రాక్ దాటిస్తున్న క్రమంలో కర్నూలు నుంచి సికింద్రాబాద్ వైపు వెళ్తున్న రైలు ఢీకొట్టిందని కర్నూలు రైల్వే ప్రొటెక్షన్ ఫోర్స్ (ఆర్పీఎఫ్) ఏఎస్సై రమేష్‌రెడ్డి తెలిపారు. పెద్దపోతులపాడు గ్రామానికి చెందిన ఓ వ్యక్తి పొలం పనులు ముగించుకొని స్వగ్రామానికి వెళ్తున్నాడు. శివారులోని రైల్వే అండర్ బ్రిడ్జి (ఆర్‌యూబీ) కింద వర్షపునీరు నిలవడంతో సదరు వ్యక్తి ద్విచక్ర వాహనాన్ని రైల్వే ట్రాక్ మీద దాటించేందుకు ప్రయత్నించాడు. ఇంతలో రైలు వచ్చేసింది. ద్విచక్ర వాహనాన్ని వదిలేసి రైతు సురక్షితంగా బయటపడ్డాడు. ద్విచక్రవాహనం కింద ఉండిపోవడంతో పది నిమిషాలు రైలు ఆగింది. దాన్ని ట్రాక్‌పై నుంచి తొలగించాక రైలు వెళ్లిపోయింది. లోకో పైలెట్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై వివరించారు.

యువకుల గొడవ సీసీ ఫుటేజీ వైరల్

శిరోముండనంలో పోలీసుల పాత్రపై బలపడుతున్న అనుమానాలు

ఈనాడు, మహబూబ్‌నగర్ - న్యూస్‌టుడే, లింగాల : నాగర్‌కర్నూల్ జిల్లా లింగాలలో ముగ్గురు యువకులకు శిరోముండనం చేసిన ఘటనకు ముందు జరిగిన గొడవ సీసీ కెమెరా ఫుటేజీలు సామాజిక మాధ్యమాల్లో వైరల్ అవుతున్నాయి. ఈ నెల 13న పెట్రోల్ బంక్‌లో గొడవ జరిగాక పోలీసు స్టేషన్‌కు తీసుకెళ్లి ముగ్గురికి శిరోముండనం చేసిన విషయం ఆలస్యంగా వెలుగులోకి రావటం, ఇందులో ఓ యువకుడు ఆత్మహత్యాయత్నానికి పాల్పడటం తెలిసిందే. యువకుల మధ్య గొడవతోనే అతడు ఆత్మహత్యాయత్నం చేశాడని, పెట్రోల్ బంక్ వద్ద గొడవ, శిరోముండనం ఘటనలకు, తమకు సంబంధం లేదని పోలీసులు వాదిస్తున్నారు. ఈ నేపథ్యంలో శనివారం ఆ యువకులు పెట్రోల్ బంకు వద్ద గొడవ పడిన సీసీ కెమెరా ఫుటేజీ సామాజిక మాధ్యమాల్లో చక్కర్లు కొట్టడంతో పోలీసులు కక్కలేని, మింగలేని పరిస్థితిలో పడిపోయారు. ఈ ఫుటేజీతో శిరోముండనం ఘటనలో పోలీసుల పాత్రపై అనుమానాలు బలపడుతున్నాయి. ఆత్మహత్యాయత్నానికి ప్రయత్నించిన యువకుడి తల్లిదండ్రులు పరస్పర విరుద్ధ ప్రకటనలు చేస్తున్న వీడియోలు బయటకు రావటంతో వారిపై రాజకీయ నాయకుల ఒత్తిళ్లు ఉన్నాయన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. పోలీసు స్టేషన్‌లోనూ సీసీ కెమెరాలు ఉంటాయి. అక్కడి ఫుటేజీలను ఉన్నతాధికారులు పరిశీలిస్తే వాస్తవాలు బయటకు వస్తాయన్న చర్చ జరుగుతోంది.

ఇటీవలే ఇసుక వ్యవహారం రచ్చ.. : దుందుభి వాగులో ఇసుక అక్రమ రవాణాను అరికట్టడంలో నిర్లక్ష్యంగా వ్యవహరించినందుకు 10 రోజుల కిందట జిల్లాలోని నలుగురు ఎస్సైలను వీఆర్‌కు పంపిస్తూ ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. ఇసుక వ్యవహారంలో ఇప్పటికే నాగర్‌కర్నూల్ జిల్లా పోలీసులపై మచ్చ పడింది. ఈ వ్యవహారం మరవక ముందే లింగాలలో యువకుల శిరోముండనం ఘటన జిల్లాలో చర్చనీయాంశంగా మారింది. పోలీసు శాఖ జిల్లా ఉన్నతాధికారులు అన్ని ఘటనలపై విచారణ చేపడతామని, చర్యలు తీసుకుంటామని చెబుతున్నా క్షేత్రస్థాయిలో అది కనిపించటం లేదన్న విమర్శలు వస్తున్నాయి. నేతల ఒత్తిడితోనే జిల్లా అధికారులు ఈ వ్యవహారంలో ముందుకు వెళ్లలేకపోతున్నారని వినిపిస్తోంది.

వాహనం నుంచి జారిపడి బాలకార్మికుడి మృతి

పెద్దకొత్తపల్లి, న్యూస్‌టుడే : మండలకేంద్రంలో శనివారం ఉదయం వాహనం నుంచి జారి కింద పడి బాలకార్మికుడు (17) మృతి చెందాడు. పోలీసుల కథనం ప్రకారం.. చుక్కాయిపల్లి నుంచి తాడూరుకు పత్తితీత కోసం కూలీలు సుమారు పన్నెండు మంది బొలేరో వాహనంలో బయలుదేరారు. పెద్దకొత్తపల్లి దాటాక అదుపు తప్పి వాహనంపైన కూర్చున్న బాలుడు (17) కిందపడ్డాడు. తీవ్ర గాయాలవడంతో నాగర్‌కర్నూల్ జనరల్ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మృతి చెందినట్లు హెడ్‌కానిస్టేబుల్ మల్లేశ్ తెలిపారు. తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

హత్య కేసులో ఇద్దరికి జీవిత ఖైదు

మహబూబ్‌నగర్ నేరవిభాగం, న్యూస్‌టుడే: హత్య కేసులో ఇద్దరికి జీవిత ఖైదుతో పాటు జరిమానా విధించారు. అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ బాలస్వామి శనివారం తెలిపిన వివరాల ప్రకారం.. వనపర్తి జిల్లా శ్రీరంగాపూర్ మండలంలోని జానంపేటకు చెందిన పాటిమిటి చిన్నరాజు, లలిత దంపతులు. ఆమెకు అదే గ్రామానికి చెందిన మధుగాని కురుమూర్తితో వివాహేతర సంబంధం ఉంది. 2019 మే 30న కురుమూర్తి జాతరకు భార్యాభర్తలు ఇద్దరు వచ్చారు. అక్కడికి ఆమె ప్రియుడు కూడా వచ్చాడు. భర్తకు మద్యం తాపించి నిర్జన ప్రదేశానికి తీసుకెళ్లి టవల్‌తో గొంతుకు చుట్టి చంపేశారు. దీంతో మృతుడి అన్న అదే రోజు పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు మృతదేహాన్ని స్వాధీనం చేసుకొని అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేశారు. అనంతరం కేసు పరిశోధించి హత్యతో సంబంధం ఉన్నవారిని పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు పంపించారు. బెయిల్‌పై బయటికి రాగా తరువాత న్యాయస్థానంలో కేసు నడుస్తోంది, అందులో వాదోపవాదనలు విన్న కుటుంబ న్యాయస్థాన జడ్జి శ్రీదేవి ఇద్దరు నిందితులకు జీవిత ఖైదుతో పాటు రూ.5వేల జరిమానాను విధించారు.



సస్యరక్షణ చర్యలకు సన్నద్ధం!

ప్రస్తుతం పంటలన్నీ పొట్టదశలో ఉన్నాయి. ఇటీవల కురిసిన వర్షాలకు చీడపీడలు ఆశిస్తుండడంతో రైతులు పురుగు మందుల పిచికారీకి సన్నద్ధమవుతున్నారు. ఇందుకోసం పిచికారీ యంత్రాలకు అవసరమైన మరమ్మతులు చేయిస్తున్నారు. యంత్రాల మెకానిక్‌లు కూడా తీరిక లేకుండా కనిపిస్తున్నారు. పెంట్లవెల్లి మండల కేంద్రంలోని ఓ దుకాణం వద్ద మరమ్మతుల కోసం రైతులు వరుసగా పెట్టిన పిచికారీ యంత్రాలను 'ఈనాడు' క్లిక్ మనిపించింది.

- ఈనాడు, మహబూబ్‌నగర్

పోలీస్ డ్యూటీ మీట్‌లో జోగులాంబ జోన్ రన్నరప్



పోలీస్ అకాడమీ డైరెక్టర్ అభిలాష బిస్త్ చేతుల మీదుగా ట్రోఫీని అందుకుంటున్న మహబూబ్‌నగర్ జిల్లా అదనపు ఎస్పీ రాములు

మహబూబ్‌నగర్ నేరవిభాగం, న్యూస్‌టుడే: రాష్ట్ర స్థాయి పోలీస్ డ్యూటీ మీట్‌లో జోగులాంబ జోన్ పోలీసులు సత్తా చాటారు. వీడియోగ్రఫీ విభాగంలో రాష్ట్రంలో ద్వితీయ స్థానంలో నిలిచి రన్నరప్ ట్రోఫీని కైవసం చేసుకున్నారు. హైదరాబాద్‌లోని రాజ్ బహదూర్ వెంకట్రాంరెడ్డి పోలీస్ అకాడమీలో మూడు రోజుల నుంచి జరుగుతున్న పోలీస్ డ్యూటీ మీట్‌లో ఉమ్మడి జిల్లా పోలీసులు ప్రతిభ చాటారు. మహబూబ్‌నగర్ జిల్లా నుంచి పీసీ -1936 శ్రీనివాస్‌రెడ్డి వీడియోగ్రఫీలో, నారాయణపేట జిల్లాకు చెందిన ఏఆర్ పీసీ -3341 చంద్రశేఖర్ గౌడ్ వ్యక్తులను తనిఖీ చేయడంలో విశేషమైన ప్రతిభ చాటారు. వారికి వెండి పతకం వచ్చింది. దీంతో జోగులాంబ జోన్ పోలీస్ శాఖకు ఓవరాల్ రన్నరప్‌గా నిలవడంతో పోలీస్ అకాడమీ డైరెక్టర్ అభిలాష బిస్త్ చేతుల మీదుగా ట్రోఫీని మహబూబ్‌నగర్ జిల్లా అదనపు ఎస్పీ రాములు తీసుకున్నారు. రాష్ట్రస్థాయిలో ట్రోఫీని గెలిచిన వారికి జోగులాంబ జోన్ డీఐజీ ఎల్ఎస్ చౌహాన్, మహబూబ్‌నగర్ ఎస్పీ డి. జానకి, నారాయణపేట ఎస్పీ యోగేశ్ గౌతమ్ అభినందనలు తెలిపారు.

చికెన్ ధరలు

ఫాంరేటు	120-00
రిటైల్	142-00
డ్రెస్డ్	206-00
స్కిన్‌లెస్	234-00

తెరపై ఈనాడు

గద్వాల: ఎస్వీసీ సినిమాస్.. దేవర, వేట్టయాన్, విశ్వం, జనక అయితే గనక, సలార్, అయిజ: శివసాయి: దేవర భువనేశ్వర్: విశ్వం, మారుడ: వేట్టయాన్
—న్యూస్‌టుడే, గద్వాల గ్రామీణం, అయిజ

టీజీవో జిల్లా నూతన అధ్యక్షుడిగా రహీముద్దీన్



ప్రతిజ్ఞ చేస్తున్న తెలంగాణ గెజిటెడ్ అధికారుల సంఘం నాయకులు

గద్వాల అర్బన్, న్యూస్‌టుడే: గద్వాలలోని ఓ ఫంక్షన్ హాల్‌లో శనివారం తెలంగాణ గెజిటెడ్ అధికారుల నూతన కార్యవర్గం ఎన్నికలు నిర్వహించారు. జిల్లా నూతన అధ్యక్షుడిగా రహీముద్దీన్, కార్యదర్శిగా శశిధర్‌రెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. రాష్ట్ర అధ్యక్షుడు ఏలూరు శ్రీనివాసరావు, కార్యదర్శి వెంగళ సత్యనారాయణ సమక్షంలో జరిగిన ఈ ఎన్నికల్లో అసోసియేట్ జిల్లా అధ్యక్షులుగా వెంకటరామారెడ్డి, ఉపాధ్యక్షులుగా భీమ్య, సతీష్‌కుమార్, మహిళా విభాగం అధ్యక్షురాలిగా రాజేశ్వరి, సంయుక్త కార్యదర్శులుగా రామాంజనేయులు, మహ్మద్, కార్యదర్శిగా యామినిసాయి, కోశాధికారిగా వెంకటరెడ్డి, ఆర్గనైజింగ్ కార్యదర్శిగా కరుణాకర్, కార్యాలయ కార్యదర్శిగా రాములు, సాంస్కృతిక విభాగ కార్యదర్శిగా పవన్‌కుమార్, క్రీడా విభాగ కార్యదర్శిగా గోపాల్ ఎంపికయ్యారు. పరమేశ్వరరెడ్డి, రామారావు ఎన్నికల అధికారులుగా వ్యవహరించారు. రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు శ్యామ్, తదితరులు పాల్గొన్నారు.

గద్వాల సీఐగా శ్రీను



గద్వాల అర్బన్, న్యూస్‌టుడే: గద్వాల నూతన సీఐగా టంగుటూరి శ్రీను శనివారం బాధ్యతలు చేపట్టారు. హైదరాబాద్ కమిషనరేట్ పరిధిలోని దబీర్‌పుర పోలీస్ స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న ఆయన బదిలీపై గద్వాలకు వచ్చారు. 2007 ఎస్సై బ్యాచ్‌కు చెందిన శ్రీను సైబరాబాద్, హకీంపేట్, వికారాబాద్ తదితర ప్రాంతాల్లో పని చేశారు. 2018లో సీఐగా పదోన్నతి పొందారు. చట్టవ్యతిరేకమైన వ్యవహారాలు ఎట్టి పరిస్థితుల్లో ఉపేక్షించనని ఈ సందర్భంగా ఆయన పేర్కొన్నారు.

2వ జోనల్‌స్థాయి కబడ్డీ జట్ల ఎంపిక

ఉండవల్లి, న్యూస్‌టుడే : ఉండవల్లి జడ్పీ ఉన్నత పాఠశాలలో నవంబరు 2న 68వ స్కూల్ గేమ్స్ ఫౌండేషన్ అండర్ -14 విభాగంలో బాలురు, బాలికల కబడ్డీ టోర్నమెంట్ నిర్వహించి జట్ల ఎంపిక ఉంటుందని ఎస్‌జీఎఫ్ కన్వీనర్ శైలజ శనివారం తెలిపారు. ఈ పోటీలలో ఉమ్మడి జిల్లా బాలికలు, బాలురు పాల్గొంటారని కన్వీనర్ పేర్కొన్నారు.

కసితో చదివితే లక్ష్య సాధన



విజేతలకు బహుమతులు అందజేస్తున్న ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల జీహెచ్‌ఎం జహీరుద్దీన్



బహుమతులు అందజేస్తున్న విశిష్ట నోబుల్ ఉన్నత పాఠశాల ప్రిన్సిపల్ జయలక్ష్మి

గద్వాల అర్బన్, న్యూస్‌టుడే: కసితో చదివితే తామనుకున్న లక్ష్యాన్ని సాధించవచ్చని గద్వాలలోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల జీహెచ్‌ఎం జహీరుద్దీన్, విశిష్ట నోబుల్ ఉన్నత పాఠశాల ప్రిన్సిపల్ జయలక్ష్మి పేర్కొన్నారు. శనివారం ‘ఈనాడు’ ఆధ్వర్యంలో ‘ఈనాడు ప్రతిభా పాటవ’ పోటీలో భాగంగా ఆయా పాఠశాలల్లో ‘ఇంటర్నెట్ వినియోగం వల్ల లాభనష్టాలు, విద్యార్థులపై సోషల్ మీడియా ప్రభావం’ అనే అంశంపై వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ప్రభుత్వ బాలికల పాఠశాలలో నిర్వహించిన పోటీలో మొదటి స్థానంలో అఖిలాబాయి, రెండో స్థానంలో పల్లవి, మూడో స్థానంలో మణి నిలిచారు. విశిష్ట నోబుల్ పాఠశాలలో నిర్వహించిన పోటీలో సవిత, అన్విత ముబాషిరా, దీక్ష వరుసగా తొలి మూడు స్థానాల్లో నిలిచారు. విజేతలకు జీహెచ్‌ఎం, ప్రిన్సిపల్, కరస్పాండెంట్లు బహుమతులు అందజేసి అభినందించారు. శ్రీనివాసులు, జయ, శ్రీదేవి, రాజానందం, సుహాసిని, తిమ్మన్న, అరుణశ్రీ, విజయలక్ష్మి, విజయేశ్వరి, జమున, ప్రవంతి పాల్గొన్నారు.

ఉపాధ్యాయులు లేకుండా మా పిల్లల చదువులెలా?



మాట్లాడుతున్న ఎంఈవో భగీరథరెడ్డి

రాజోలి, న్యూస్‌టుడే : పిల్లల సంఖ్యకు తగినట్లుగా ఉపాధ్యాయులు లేకపోవడంతో మా పిల్లలకు పూర్తి స్థాయిలో విద్య అందడం లేదని, నలుగురు ఉపాధ్యాయులు బదిలీ అయితే ఒక్కరు మాత్రమే వచ్చారని తల్లిదండ్రులు ఎంఈవో భగీరథరెడ్డి ముందు వాపోయారు. మండలంలోని పెద్దధన్వాడ గ్రామంలో మూడో శనివారం సందర్భంగా హెచ్‌ఎం స్వప్న ఆధ్వర్యంలో పీటీఎం(తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల సమావేశం) నిర్వహించగా, ఎంఈవో హాజరయ్యారు. ఈ సమావేశంలో ఉపాధ్యాయుల కొరతతో పాటు, బడిబయట పిల్లలు, మధ్యాహ్న భోజనం తదితర అంశాలపై చర్చించారు. ఉపాధ్యాయుల కొరత తీర్చేందుకు తన వంతుగా కృషి చేస్తానని, పిల్లలను క్రమం తప్పకుండా బడికి పంపాలని ఎంఈవో అన్నారు. కార్యక్రమంలో ఎంవీఎఫ్ మండల సమన్వయకర్త హన్మిరెడ్డి, గ్రామస్థులు పాల్గొన్నారు.

గ్రామీణ రహదారుల నిర్మాణంలో నిర్లక్ష్యం



కొంకలలో కంకర వేసి ఇలా వదిలేశారు..!

వడ్డేపల్లి, న్యూస్‌టుడే : ప్రతి గ్రామానికీ తారు రోడ్డు వేయాలని ప్రభుత్వం నిధులు మంజూరు చేస్తున్నా పనులు చేయించడంలో అధికారులు విఫలమవుతున్నారనే ఆరోపణలున్నాయి. ఏళ్ల తరబడి పనులు పూర్తి కాకపోవడంతో అధ్వాన రహదారుల మీదే గ్రామీణులు రాకపోకలను సాగించాల్సి వస్తోంది. కొన్ని సార్లు పనుల జాప్యం వల్ల నిధులు వెనక్కి పోయిన సందర్భాలు కూడా ఉన్నాయి.

గుత్తేదారులు చేసినపుడే..

- టెండర్ దక్కించుకున్న గుత్తేదారు ఒక్కో పని వరుస క్రమంలో చేస్తూ పోతామని చెప్పి అసలే పనులు చేపట్టడం లేదు. దీంతో తమ గ్రామ వంతు ఎప్పుడు వస్తుందో, అసలు రాదో తెలియక ఏళ్ల తరబడి ప్రజలు ఎదురు చూస్తున్నారు. అధికారులు పనులు చేయని గుత్తేదారుల పట్ల ధైర్యంగా చర్యలు తీసుకోలేకపోతున్నారు.
- శాంతినగర్ నుంచి రామాపురం వరకు 4 కి.మీ. రూ 50 లక్షలు మంజూరై ఐదేళ్లు దాటుతోంది. అక్కడక్కడా అరకొరగా కంకర మట్టి పరిచి మూడేళ్లవుతున్నా పనుల పూర్తికి చర్యలు తీసుకోవడంలేదు.
- వడ్డేపల్లి శివారు నుంచి శాంతినగర్ మధ్యన మిగిలిన 4 కి.మీ. రాజోలి రహదారి నిర్మాణం రెండు నెలల కిందట చేపట్టి గుంతలు కనబడకుండా కంకర మట్టి పోసి రోలర్ తిప్పి వదిలేశారు.
- జూలేకల్ నుంచి తుమ్మిళ్ల వరకు రూ. 2.36 కోట్లు రాగా ఇటీవలే జూలేకల్ స్టేజీ నుంచి కొంకల వరకు రెండు కి.మీ. కంకర, మట్టి వేసి గుంతలు కనబడకుండా చేసి వెళ్లారు. జూలేకల్ నుంచి స్టేజీ వరకు రెండేళ్ల కిందట కంకర పరిచి వదిలేశారు.
- వెంకటాపురం స్టేజీ నుంచి మాన్‌దొడ్డి వరకు 12 కి.మీ. రూ. 1.68 కోట్లు వచ్చి ఐదేళ్లవుతున్నా పనులు ఇంతవరకు మొదలవలేదు.
- కొయిలదిన్నె నుంచి వల్లూరు వరకు రూ. 5 కి.మీ. రూ. 70 లక్షలతో పనులు చేశారు. మద్దెలబండ నుంచి మల్దకల్ 7.6. కి.మీ. రూ. 1.66 కోట్లతో, జాతీయ రహదారి నుంచి నారాయణపుర వరకు రూ. 30 లక్షలతో పనులు పూర్తి చేశారు.



రామాపురం రహదారి దుస్థితి

- వడ్డేపల్లి, కొంకల, జూలేకల్ రహదారులు మొదలు పెట్టి కంకర పరిచి, ఎర్రమట్టి వేసి పోయారు. రహదారులపై ప్రయాణం చేయలేక వాహనాలు మరమ్మతులకు గురవుతున్నాయి. సమయానికి గమ్యం చేరుకోలేక పోతున్నారు.
- శాంతినగర్, కొయిలదిన్నె, రామాపురం రహదారులపై వర్షం పడితే చిత్తడిగా ఉండటంతో పాటు పెద్ద పెద్ద లోతైన గోతుల్లో నీరు నిలిచి ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. కొంకల నుంచి తాండ్రపాడు, తనగల నుంచి పచ్చర్ల, మాన్‌దొడ్డి వరకు వర్షాలు పడినపుడు బురద రోడ్లుగా మారుతున్నాయి.



చర్యలు తీసుకోవాలి: రోడ్ల నిర్మాణ పనులు పూర్తిచేయించడానికి అధికారులు చర్యలు తీసుకోవాలి. నిధులు వెనక్కుపోక ముందే పనులు పూర్తి చేస్తే ప్రజలకు మేలు జరుగుతుంది. గుత్తేదారుల సంక్షేమం గురించి ఆలోచించే అధికారులు ప్రజల సదుపాయాలు మెరుగు పరచాలి. గ్రామాలకు రవాణా వసతులు కల్పించడానికి అధికారులు చొరవ చూపితే నే మేలు. -పోలుకల్ లోకేశ్ యాదవ్, శాంతినగర్



ఏళ్లు గడుస్తున్నా: దారుణమైన రహదారుల మీద వాహనాలు తొందరగా మరమ్మతులకు గురవుతున్నాయి. గమ్యానికి సమయానికి చేరుకోలేక తీవ్రంగా నష్టాలకు లోనవుతున్నాం. ట్రాక్టర్లు, జీపులు వంటి వాటి టైర్ల అరుగుదల ఎక్కువ ఉంటోంది. బీటీ రోడ్లు వస్తున్నాయని సంబరపడ్డాం. ఏళ్లు గడిచినా పని మాత్రం సాగడం లేదు. -రవి, తనగల

పూర్తికి కృషి: రహదారుల నిర్మాణం విషయంలో ప్రత్యేక శ్రద్ధ తీసుకొని పనులు తప్పక పూర్తి చేయించడానికి కృషి చేస్తాం. నిర్లక్ష్యం వహించే గుత్తేదారులపై శాఖాపరమైన చర్యలు చేపడతాం. సీఆర్ఆర్ నిధులతో చేసిన పనులకు గుత్తేదారులకు నిధులు రాక సమస్యగా మారింది. నిధుల లభ్యతను బట్టి పనులు చేస్తాం. -దామోదర్‌రావు, ఈఈ, పీఆర్

భూవివాదంలో దాడి.. ముగ్గురికి తీవ్ర గాయాలు

ధరూరు, న్యూస్‌టుడే : కేటీదొడ్డి మండలం చింతలకుంట గ్రామంలో భూవివాదంలో దాడులకు తెగబడటంతో ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. పోలీసుల కథనం ప్రకారం.. చింతలకుంట గ్రామానికి చెందిన నాగేంద్రకు పొలం ఉంది. శనివారం ఉదయం అదే గ్రామానికి చెందిన పలువురు నాగేంద్ర పొలం తమదంటూ ట్రాక్టర్‌తో దున్నటానికి ప్రయత్నించగా వివాదం మొదలైంది. విజయ్, కుర్వ మౌలన్న, శారదమ్మ, వీరన్న అనే వ్యక్తులు నాగేంద్ర, అతడి కుటుంబ సభ్యులపై కర్రలతో దాడి చేశారు. నాగేంద్ర, ఆయన భార్య మహేశ్వరమ్మ, అన్న ఆంజనేయులకు తీవ్ర గాయాలు కాగా వారిని గద్వాల ప్రభుత్వాస్పత్రికి తరలించారు. నాగేంద్ర ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై శ్రీనివాసులు తెలిపారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

మల్దకల్ : కుర్తిరావులచెర్వుకి చెందిన మాజీ జడ్పీటీసీ పటేల్ ప్రభాకరరెడ్డి కుమారుడు రామచంద్రారెడ్డి నాలుగు రోజుల కిందట రోడ్డు ప్రమాదంలో మృతిచెందగా, ఎమ్మెల్సీ చల్లా వెంకట్రామిరెడ్డి, ఎమ్మెల్యే విజయుడు శనివారం కుర్తిరావుల చెర్వు చేరుకుని బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. చల్లా అగస్త్యరెడ్డి, డోకూర్ పవన్‌కుమార్ భారాస నాయకులు పాల్గొన్నారు.

మెనూ ప్రకారం పౌష్టికాహారం

మానవపాడు : అంగన్వాడీ కేంద్రాలకు వచ్చే పిల్లలు, గర్భిణులు, బాలింతలకు మెనూ ప్రకారం పౌష్టికాహారం అందించాలని మానవపాడు ఐసీడీఎస్ ప్రాజెక్ట్ సీడీపీవో సుజాత అన్నారు. మండల మహిళా సమాఖ్య భవనంలో మానవపాడు, ఇటిక్యాల మండలాలకు చెందిన అంగన్వాడీ టీచర్లతో సమావేశం నిర్వహించారు. కేంద్రాల్లో ప్రీ స్కూల్ టైమ్ టేబుల్‌ను పకడ్బందీగా అమలు చేయాలన్నారు.

డ్యాం రహదారి గుంతలమయం

రాజోలి నుంచి కర్నూలు పట్టణానికి నిత్యం వందల వాహనాల్లో ప్రజలు ప్రయాణిస్తుంటారు. అయితే సుంకేసుల డ్యాం వద్ద రహదారి అత్యంత అధ్వానంగా మారింది. డ్యాం తోరణం నుంచి గేట్ల వరకు రహదారి గుంతలతో నిండిపోయింది. దీంతో వాహనదారులు అవస్థలు పడుతున్నారు. సుమారు 14 ఏళ్లుగా ఈ పరిస్థితి ఉన్నా ప్రజాప్రతినిధులు, అధికారులు పట్టించుకోవడం లేదని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. డ్యాం రహదారిని బాగు చేసే బాధ్యత ఏపీ పరిధిలో ఉంటుందని ఎంపీడీవో ఖాజా మొహినుద్దీన్ తెలిపారు.



-న్యూస్‌టుడే, రాజోలి

పాదచారులు నడిచేందుకు దారేది?

గద్వాలలోని కలెక్టర్ కార్యాలయం ముందు ఫుట్‌పాత్‌పై కొందరు ద్విచక్ర వాహనాలు పార్కింగ్ చేసి వెళ్తున్నారు. నిత్యం కలెక్టరేట్‌కు వందల సంఖ్యలో ప్రజలు వస్తుంటారు. దీంతో నడిచేందుకు వీలులేకుండా పోతోందని కార్యాలయానికి వచ్చే జనం ఆరోపిస్తున్నారు. వాహనాలు నిలపకుండా చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు.



-న్యూస్‌టుడే, గద్వాల పట్టణం

ప్రహరీ లేక ఇబ్బందులు

ప్రహరీలేని ఎ.బూడిదపాడు గ్రామంలోని ప్రభుత్వ పాఠశాల ఇది. దీంతో జంతువులు, విష కీటకాలు పాఠశాల ఆవరణలోకి వస్తున్నాయని, దీంతో ఇబ్బందులు పడుతున్నామని విద్యార్థులు, తల్లిదండ్రులు అంటున్నారు. అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారే అవకాశం ఉందని వారంటున్నారు. అధికారులు స్పందించి ప్రహరీ నిర్మించాలని కోరుతున్నారు. విషయం ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లామని ఎంఈవో శివప్రసాద్ తెలిపారు.

-న్యూస్‌టుడే, మానవపాడు



రోడ్డుపై నాట్లేసి నిరసన



లింగనవాయి న్యూప్లాట్స్ కాలనీలో సీసీ రోడ్డు లేకపోవడంతో వర్షం కురిసిన ప్రతి పర్యాయం ఇబ్బందులు పడుతున్నామని కాలనీవాసులు వర్షపు నీటిలో నాట్లు వేస్తూ నిరసన వ్యక్తం చేశారు. చాలా సంవత్సరాల నుంచి కాలనీలో ఈ పరిస్థితి ఉందని, వర్షం కురిసిన సమయంలో రహదారి బురదమయం అవుతోందని వారంటున్నారు. అనేక పర్యాయాలు అధికారుల దృష్టికి తీసుకవెళ్లినా సమస్య తీర్చడం లేదని కాలనీ వాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సీపీఎం నాయకుడు ఈదన్న, కాలనీ వాసులు స్వాములు, లోకేష్, నజీర్, రామాంజనేయులు, రజియాబి, తదితరులు పాల్గొన్నారు.

-న్యూస్‌టుడే, అలంపూర్

బాధిత కుటుంబాలకు ఆర్థికసాయం



మహిళకు రైతుబీమా చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే కృష్ణమోహన్‌రెడ్డి

గద్వాల గ్రామీణం, న్యూస్‌టుడే : కేటిదొడ్డి మండలం వెంకటాపురం గ్రామానికి చెందిన రైతు రాధయ్య అనారోగ్యంతో బాధపడుతూ గత కొన్నిరోజుల కిందట మృతిచెందారు. కాగా శనివారం గద్వాలలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో రాధయ్య భార్య అరుణమ్మకు రూ.5 లక్షల రైతుబీమా చెక్కును ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి చేతుల మీదుగా అందజేశారు. మల్దకల్ మండలం బిజ్వారం గ్రామానికి చెందిన బొజ్జన్నకు మెరుగైన వైద్య చికిత్స నిమిత్తం ముఖ్యమంత్రి కార్యాలయం నుంచి వచ్చిన రూ. 1.50లక్షల ఎల్వోసీ లెటర్‌ను బాధిత కుటుంబ సభ్యులకు ఎమ్మెల్యే అందజేశారు. జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ ఛైర్మన్ జంబు రామన్‌గౌడ, నాయకులు గడ్డం కృష్ణారెడ్డి, రాజశేఖర్, మురళి, తదితరులు పాల్గొన్నారు.

‘జీవో వెనక్కి తీసుకున్నాకే పరీక్ష నిర్వహించండి’

మల్దకల్, న్యూస్‌టుడే: గ్రూప్-1 పరీక్షలు వాయిదా వేయాలని, జీవో-29 వెనక్కి తీసుకున్న తర్వాతనే పరీక్ష నిర్వహించాలని బీఎస్పీ గద్వాల నియోజకవర్గ ఇన్‌ఛార్జి బండారి రాజు డిమాండ్ చేశారు. శనివారం మల్దకల్ మండల కేంద్రంలో పార్టీ కార్యకర్తలతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. గ్రూప్- 1మెయిన్స్ పరీక్షను రీషెడ్యూల్ చేయాలన్న అభ్యర్థుల డిమాండ్లను పరిశీలించకుండా ఈనెల 21న ప్రభుత్వం పరీక్ష నిర్వహిస్తామని ప్రకటించడం సరైన పద్ధతి కాదన్నారు. మెయిన్‌కు సంబంధించి పలు కేసులు కోర్టులో ఉన్నప్పటికీ ప్రభుత్వం మొండిగా పరీక్షలు నిర్వహిస్తామని అవివేకమన్నారు. ఉల్లిగడ్డల గోవిందు, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

రేపు కోదండాపురానికి శిక్షణ కలెక్టర్లు

ఇటిక్యాల: మండలంలోని కోదండాపురానికి ఈ నెల 21న శిక్షణ కలెక్టర్లు రానున్నట్లు ఎంపీడీవో అజర్ మొయినుద్దీన్ తెలిపారు. శిక్షణలో భాగంగా ఐదు రోజుల పాటు అదే గ్రామంలో ఉండనున్నట్లు ఎంపీడీవో తెలిపారు. జిల్లాకు 25 మంది శిక్షణ కలెక్టర్లు రానుండగా ఐదు మండలాలకు వారిని కేటాయించనున్నారు. అందులో బాగంగానే ఎర్రవల్లి మండలంలోని కోదండాపురానికి ఐదుగురు శిక్షణ కలెక్టర్లు రానున్నారు.

సమయ పాలన పాటించకుంటే చర్యలు

మల్దకల్, న్యూస్‌టుడే: వైద్యాధికారులు, సిబ్బంది సమయ పాలన పాటించాలని ఏమాత్రం అలసత్వం ప్రదర్శించినా చర్యలు తప్పవని జిల్లా వైద్యాధికారి సిద్ధప్ప హెచ్చరించారు. శనివారం మల్దకల్‌లోని ఆరోగ్యఉపకేంద్రాన్ని ఆసకస్మికంగా తనిఖీ చేసి సిబ్బందికి సూచనలు, సలహాలు ఇచ్చారు. సెప్టెంబర్ నెలలో 33 సుఖప్రసవాలు జరిపినందుకు వైద్యాధికారిణి స్వరూపరాణిని అభినందించారు.

విద్యారంగానికి అధిక నిధులు కేటాయించాలి



సమావేశంలో మాట్లాడుతున్న పాలమూరు అధ్యయన వేదిక కన్వీనర్ రాఘవచారి

నారాయణపేట పట్టణం, న్యూస్‌టుడే : విద్యారంగ అభివృద్ధికి కేంద్రం 10 శాతం, రాష్ట్రం 20 శాతం నిధులు కేటాయించాలని పాలమూరు అధ్యయన వేదిక కన్వీనర్ రాఘవచారి, టీపీటీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు నారాయణమ్మ అన్నారు. జిల్లా కేంద్రంలోని అంబేడ్కర్ భవన్‌లో శనివారం తెలంగాణ విద్యా పరిరక్షణ కమిటీ ఆధ్వర్యంలో తెలంగాణ విద్యారంగ సమస్యలు - సవాళ్లు - కర్తవ్యాలు అంశంపై రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో రాఘవచారి మాట్లాడుతూ. . విశ్వవిద్యాలయాల్లో దాదాపు 2 వేల ప్రొఫెసర్ ఉద్యోగాలు ఖాళీగా ఉండటంతో పాటు లక్షల్లో నిరుద్యోగులు ఉండటం విద్యా సంక్షోభానికి ఒక ఉదాహరణగా చెప్పారు. నారాయణమ్మ మాట్లాడుతూ.. ఉపాధ్యాయుల సర్దుబాటు జీవో 25ని వెనక్కి తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో తెలంగాణ విద్యా పరిరక్షణ కమిటీ నాయకులు రెడ్డప్ప, సూర్యచంద్ర, హైమావతి, వెంకట్‌రాములు పాల్గొన్నారు.

కేజీబీవీలో శుద్ధజల యంత్రం ప్రారంభం



యంత్రాన్ని ప్రారంభిస్తున్న మండల విద్యాధికారి శివప్రసాద్

ఉండవల్లి, న్యూస్‌టుడే: కలుగొట్ల కేజీబీవీలో శనివారం శుద్ధ జల యంత్రాన్ని మండల విద్యాధికారి శివప్రసాద్ ప్రారంభించారు. విద్యార్థినుల సౌకర్యార్థం శుద్ధజలం అందుబాటులోకి తీసుకొచ్చేందుకు విద్యార్థినుల తల్లిదండ్రులు, కలుగొట్ల గ్రామ రైతు సంఘం సభ్యులు ఆర్థికసాయం అందజేసినట్లు ఎస్‌వో పరిమళ తెలిపారు. తల్లిదండ్రులు రూ. 70 వేలు, రైతుసంఘం సభ్యులు రూ. 30 వేలు ఆర్థికసాయం చేసినట్లు పేర్కొన్నారు. జీసీడీవో ఫర్జానాబేగం, రైతుసంఘం సభ్యులు శ్రీనివాసరెడ్డి, సాయిబాబా తదితరులు పాల్గొన్నారు.

దైవ చింతనతోనే మానసిక ప్రశాంతత

మల్దకల్, న్యూస్‌టుడే: దైవచింతనతోనే మానసిక ప్రశాంతత లభిస్తుందని ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మికంగా ఎదగాలని వాల్మీకి సంఘం జిల్లా నాయకుడు మనోహర్‌నాయుడు అన్నారు. వాల్మీకి జయంతి సందర్భంగా మద్దెలబండ వాల్మీకి ఆలయంలో రెండు రోజుల పాటు జిల్లాస్థాయి భజన పోటీలు నిర్వహించగా శనివారంతో ముగిశాయి. విజేతలకు బహుమతులను అందజేసి మాట్లాడారు. మొదటి బహుమతి సాధించిన ఇటిక్యాల మండలం నక్కపల్లి గ్రామానికి చెందిన వీరమారుతి భజనమండలికి మనోహర్‌నాయుడు రూ. రూ. 10,016 అందజేశారు. ద్వితీయస్థానంలో నిలిచిన అయిజ మండలం పర్దిపురం మారుతి భజనమండలికి రూ. 5,016 మాజీ ఎంపీపీ పెద్దవీరన్న అందజేశారు. మూడో బహుమతి ఏబూడిదపాడు వేణుగోపాల స్వామి భజనమండలికి రూ 3,016 మిల్లు కృష్ణయ్య అందజేశారు.

కేంద్ర ప్రభుత్వ బీమాతో లబ్ధి

మల్దకల్, న్యూస్‌టుడే: కేంద్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన జనసురక్ష కార్యక్రమంలో భాగంగా అర్హత ఉన్న ప్రతి ఒక్కరూ పీఎంజేజేబీవై, పీఎంఎస్‌బీవై, ఏపీవై కింద బీమా చేసుకుని లబ్ధిపొందాలని ఏపీజీవీబీ బ్యాంక్ మేనేజర్ జి. రాఘవేంద్ర కోరారు. శనివారం మల్దకల్ మండలం మల్లెందొడ్డిలో రైతులతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసి కేంద్రప్రభుత్వం అందజేస్తున్న బీమా పథకాలను వివరించారు. గ్రామంలో ఇటీవల గుండెపోటుతో గొంగళ్ల గోపాల్ మృతిచెందగా, నామిని మహేశ్వరికి పీఎంజేజేబీవై కింద మంజూరైన రూ. 2లక్షల చెక్కును అందజేశారు.



బీమాచెక్కును అందజేస్తున్న బ్యాంక్ మేనేజర్, తదితరులు

రైతు రుణమాఫీ వెంటనే పూర్తిచేయండి



మాట్లాడుతున్న రంజిత్‌కుమార్

గద్వాల గ్రామీణం, న్యూస్‌టుడే: రైతు రుణమాఫీని వెంటనే పూర్తి చేయాలని నడిగడ్డ హక్కుల పోరాట సమితి జిల్లా ఛైర్మన్ గొంగళ్ల రంజిత్‌కుమార్ డిమాండ్‌చేశారు. శనివారం గద్వాలలోని నడిగడ్డ హక్కుల పోరాట సమితి జిల్లా కార్యాలయంలో పోరాట సమితి నాయకులతో కలిసి సమావేశం నిర్వహించి మాట్లాడారు. సాంకేతిక కారణాలు సాకుగా చూపుతూ చాలా మందికి రుణ మాఫీ చేయడంలేదన్నారు. ఇప్పటిదాకా మాఫీ కాని వారి వివరాలు సేకరించి త్వరలో కలెక్టర్ ద్వారా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామన్నారు. దసరాలోపు ఇస్తామన్న రైతుభరోసాను కూడా ఇవ్వాలని డిమాండ్ చేశారు.

అక్షరాస్యతపై ఆటపాటలతో అవగాహన

ఇటిక్యాల, న్యూస్‌టుడే: మండలంలోని పుటాన్‌దొడ్డి గ్రామంలో జిల్లా సాంస్కృతిక సారథి కళాకారులు అక్షరాస్యత ప్రాముఖ్యతను తెలిపేలా ఆటపాటలతో అవగాహన కార్యక్రమం చేపట్టారు. పంచాయతీ కార్యాలయం వద్ద నిర్వహించిన ఈ కార్యక్రమంలో సమాజంలో చదువుకున్న విలువ గురించి, చదువుకుంటే కలిగే ప్రయోజనాల గురించి వివరించారు. పిల్లలను పొలం పనికి పంపి బాల కార్మికులుగా మార్చొద్దని, తప్పనిసరిగా బడికి పంపించాలని సూచించారు.

మహాసభల విజయవంతానికి పిలుపు



అలంపూర్‌లో కరపత్రాల విడుదల


ధరూరు, అలంపూర్, న్యూస్‌టుడే: ఈనెల 25, 26 తేదీల్లో గద్వాలలో నిర్వహిస్తున్న సీపీఐ(ఎం) మహాసభలను విజయవంతం చేయాలని జిల్లా పార్టీ బాధ్యుడు వెంకటస్వామి పిలుపునిచ్చారు. శనివారం ధరూరు మండల కేంద్రంలో సీపీఎం కార్యకర్తల సమావేశం నిర్వహించారు. సభలకు కార్మిక సంఘాల సభ్యత్వం ఉన్న ప్రతి ఒక్కరూ హాజరు కావాలన్నారు. కార్మికుల సమస్యల పరిష్కారానికి ఐక్యంగా ఉండాలన్నారు. మహాసభలకు సంబంధించిన కరపత్రాన్ని ధరూరులో విడుదల చేశారు. * గద్వాలలో జరిగే మహాసభలను జయప్రదం చేయాలని పార్టీ జిల్లా కమిటీ సభ్యులు రేపల్లె దేవదాసు, ఈదన్నలు పిలుపునిచ్చారు. అలంపూర్ పట్టణ అంబేద్కర్ విగ్రహం వద్ద జిల్లా మహాసభలకు సంబంధించిన కరపత్రాలను విడుదల చేశారు. కార్యదర్శి ఈదన్న, వెంకటస్వామి, నరసింహ, భూపాల్, అయ్యప్ప, నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.

సీఎం కప్ క్రీడల నిర్వహణ ప్రతిష్ఠాత్మకం

గద్వాల అర్బన్, న్యూస్‌టుడే: ఈ నెల 21 నుంచి ప్రారంభమయ్యే సీఎం కప్ 2024 క్రీడలను ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించాలని జిల్లా అదనపు కలెక్టర్ లక్ష్మీనారాయణ సంబంధితాధికారులను ఆదేశించారు. శనివారం కలెక్టరేట్‌లో అధికారులతో నిర్వహించిన సమావేశంలో ఆయన పలు ఆదేశాలు, సూచనలు ఇచ్చారు. తహసీల్దార్, ఎంఈవో, వ్యాయామ ఉపాధ్యాయులు సమన్వయంతో నిర్వహించాలని సూచించారు. షెడ్యూల్ ప్రకారం ఈ నెల 21 నుంచి 24 వరకు గ్రామ పంచాయతీ స్థాయి, 26 నుంచి 30 వరకు మండల, నవంబర్ 8 నుంచి 13 వరకు జిల్లా స్థాయిలో నిర్వహిస్తారని పేర్కొన్నారు. అదనపు కలెక్టర్ నర్సింగరావు, ఆర్డీవో రాంచందర్ ఏవో వీరభద్రప్ప, జిల్లా క్రీడాధికారి ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తులు పూర్తిచేయండి: పెండింగ్‌లో ఉన్న ధరణి, ప్రజావాణి దరఖాస్తులను తక్షణమే పూర్తి చేయాల్సిందిగా జిల్లా అదనపు కలెక్టర్ లక్ష్మీనారాయణ అధికారులను ఆదేశించారు. గద్వాల కలెక్టరేట్‌లోని తన ఛాంబర్‌లో ఆయన తహసీల్దార్లతో సమావేశం నిర్వహించి మాట్లాడారు.

మానవ అక్రమ రవాణా నిర్మూలన అందరి బాధ్యత



కార్యక్రమంలో ఫౌండేషన్ సంస్థ సభ్యులు, ఉపాధ్యాయులు

మానవపాడు, న్యూస్‌టుడే: మానవ అక్రమ రవాణా నిర్మూలన మనందరి బాధ్యతని రాజ్‌కుమార్ ఫౌండేషన్ స్వచ్ఛంద సేవాసంస్థ అధ్యక్షురాలు రత్నకుమారి అన్నారు. మానవపాడు, జల్లాపురం గ్రామాల్లో సంస్థ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు, పోలీసులతో కలిసి మానవ అక్రమ రవాణా అరికట్టాలని కోరుతూ శనివారం నిశ్శబ్ద ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆడపిల్లలపై అత్యాచారాలు, అమానుషాలు అరికట్టాలన్నారు. బానిసత్వాన్ని అంతం చేసినప్పుడే ప్రజలంతా స్వేచ్ఛగా జీవిస్తారన్నారు. జల్లాపురం జడ్పీ ఉన్నత పాఠశాల జీహెచ్‌ఎం విష్ణువర్ధన్, హెచ్‌ఎం ఆనందం పాల్గొన్నారు.

భారాస నేతలపై కేసు నమోదు

గద్వాల అర్బన్, న్యూస్‌టుడే: నిరసనలో భాగంగా శనివారం గద్వాల కలెక్టరేట్ వద్ద సీఎం దిష్టిబొమ్మను దహనం చేసిన భారాస నేతలు బాసు శ్యామల, మోనేష్, రాము, తిమ్మప్పగౌడ్‌లతో పాటు మరికొందరిపై కేసు నమోదు చేసినట్టు గద్వాల పట్టణ ఎస్సై కల్యాణ్‌కుమార్ తెలిపారు. కలెక్టరేట్ గేటుకు అడ్డంగా ఉండి ప్రజలకు ఇబ్బంది కలిగించిన నేపథ్యంలో భారాస నేతలపై కేసు నమోదు చేసినట్టు వివరించారు.

ద్విచక్రవాహనం సీటు కింద పాము

ఉండవల్లి, న్యూస్‌టుడే: ద్విచక్రవాహనం సీటు కింద పాము దూరింది. పెబ్బేరుకు చెందిన గోపాల్ తన వ్యక్తిగత పనుల నిమిత్తం కర్నూలు జిల్లాకు వెళ్లి వస్తూ వర్షం కురుస్తుండటంతో అలంపూర్‌చౌరాస్తలో ఆగాడు. ద్విచక్రవాహనానికి కొత్త సీటు కవరు వేయించేందుకు సంబంధిత దుకాణం వద్దకు వెళ్లాడు. కవరు వేసేందుకు సీటును తీయగా అందులో పాము ఉన్నట్లు గుర్తించి వాహనాన్ని వదిలేశారు. అది కిందపడటంతో పాము వాహనం చైన్‌లో ఇరుక్కుని మృతిచెందింది.